www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 7 జూన్ 2025

తాళ్లపాకలో 9న యోగాంధ్ర

ప్రజాశక్తి-రాయచోటి

బక్రీద్ పండుగ నేపథ్యంలో శనివారం తాళ్లపాక అన్నమయ్య సన్నిధిలో నిర్వహించాల్సిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 617 వసంతాలు పూర్తి చేసుకున్న శ్రీఅన్నమాచార్యులను స్మరిస్తూ తాళ్లపాకలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద జూన్ 9న సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి 8 గంటల వరకు 617 మందితో యోగాసనాలు వేయనున్నట్లు తెలిపారు. ఆయన రచించిన 32 వేల సంకీర్తనలకు ఘన నివాళిగా ఆ రోజు జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో 32 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాల్లో ఆయా ప్రాంతాల్లో నిర్వహించే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టీచర్ల బదిలీల్లో గందరగోళం

ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం నెలకొంది. ఉమ్మడి కడప జిల్లాలో ఒకేచోట ఐదేళ్లు, ఎనిమిదేళ్లు సర్వీసులు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి. ప్రభుత్వం బదిలీలకు మార్గదర్శకాలను విడుదల చేసింది. సీనియారిటీ ప్రాతిపదికన పలువురు ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకున్న బదిలీల్లో పాఠశాల విద్యాశాఖ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందనే విమర్శ వినిపిస్తోంది. ఉదాహరణగా సబ్జెక్టు ఉపాధ్యాయ పోస్టు లేని హైస్కూల్‌కు సబ్జెక్టు ఉపాధ్యాయుడిని బదిలీ చేయడం దగ్గర నుంచి ఆప్షన్లు ఎంపిక చేసుకున్న ఉపాధ్యాయులను రిజర్వ్‌లో ఉంచడం, కొంతమందిని ఎంపిక చేసుకున్న పాఠశాలలకు గాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో బదిలీల్లోని డొల్లతనం బయటపడిందనే వాదన వినిపిస్తోంది.

పోస్టు లేని చోటికి స్పెషలిస్టు టీచర్!
ఆప్షన్లు విస్మరించి ఇష్టారాజ్యంగా బదిలీలు
స్పౌజ్ బదిలీల్లో పారదర్శకతకు పాతర

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ క్లైమాక్స్‌కు చేరుకుంది. సుమారు 6,500 మంది ఉపా ధ్యాయుల బదిలీ ప్రక్రియ నడు స్తోంది. 2,500 మంది స్కూల్ అసిస్టెంట్లలో 164 మందికి ప్రమోషన్, 3,900 మంది ఎస్‌జిటిలు, 91 మంది ప్రధానో పాధ్యాయులు ఉన్నారు. ఐదేళ్లు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిలు, ఎనిమిదేళ్లునిండిన ప్రధానోపాధ్యాయులు బదిలీలకు అర్హులు. తొలి విడత కింద 91 మంది ప్రధానోపాధ్యాయుల బదిలీలను పూర్తి చేసింది. రెండవ విడత కింద ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో 2,500 మంది స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు చేపట్టాల్సి ఉంది. ఆలస్యంగానే స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. గురువారం స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ఆప్షన్ విడుదల చేసింది. సంబంధిత స్కూల్ అసిస్టెంట్లు ప్రొఫెషన్స్, జనరల్ కేటగిరీల ప్రాతిపదికన బదిలీ ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. పాఠశాల విద్యాశాఖ ఇష్టారాజ్యంగా బదిలీలు చేసింది. సంబేపల్లి మండలం శెట్టిపల్లి హైస్కూల్‌కు ఇంగ్లీష్ సబ్జెక్టు నిపుణుడిని బదిలీ చేసింది. అక్కడ ఇంగ్లీష్ బోధించే పోస్టు లేకపోవడంతో తిరుగు ముఖం పట్టాల్సి వచ్చింది. కొంతమంది ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న హైస్కూళ్లకు బదిలీలు చేయకుండా, ఇతర ప్రాంతాలకు చెందిన పాఠశాలలకు బదిలీలు చేశారు. ఉదాహరణ కడప నగరంలోని బుచర్ స్ట్రీట్‌కు చెందిన ఉర్దూ హైస్కూల్ స్థానాన్ని ఎంపిక చేసుకున్న మహిళా టీచర్‌ను ఎంపిక చేయని హైస్కూల్‌కు బదిలీ చేయడం గమనార్హం. పిఇటిల బదిలీలకు సంబంధించి కడప ఉర్దూ హైస్కూల్‌ను ఎంపిక చేసుకున్నప్పటికీ చాలా మందికి ఇతర పాఠశాలలు కేటా యించడం చర్చనీయాంశంగా మారింది. స్పౌజ్ ఉద్యోగుల బదిలీల విష యంలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహ రించడాన్ని గమనిస్తే పాఠశాల విద్యాశాఖ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే వాదన ఉపా ధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తోంది. 48 మంది మ్యాథ్స్ సబ్జెక్టు ఉపాధ్యాయులు, 24 మంది ఇంగ్లీష్ సబ్జెక్టు నిపుణులు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకు న్నప్పటికీ రిజర్వ్‌లో ఉంచడం చర్చనీయాంశంగా మారింది. పలువురు సర్‌ప్లస్ ఉపాధ్యాయుల బదిలీల అంశంలోనూ గందరగోళ వాతావరణం కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలోని ఉపాధ్యాయుల బదిలీల విషయంలో పారదర్శకంగా వ్యవహరించడంలో తొట్రుపాటు కనిపిస్తుందనే వాదన పెద్దఎత్తున వినిపిస్తుండడం గమనార్హం.

ఇష్టారాజ్యంగా బదిలీలు

ఉపాధ్యాయ ఆన్లైన్ బదిలీలు ఇష్టారాజ్యంగా, గందరగోళంగా తయారయ్యాయి. పోస్టులు లేని చోటికి కూడా ఆర్డర్లు కేటాయించడం, పిఇటి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న ప్రాధాన్యత స్థానాలు ఖాళీగా ఉన్న వాటిని కేటాయించకుండా వేరే స్థానాలు కేటాయించారు. ముందస్తు ప్రణాళిక లేకుండా అధికారులకు ఇష్టమొచ్చిన రీతిలో బదిలీలు నిర్వహించారు.

-పాలెం మహేష్ బాబు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని మండలాల్లో ప్రభుత్వ భూములకు తగిన విధంగా రక్షణ కల్పించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, తహశీల్దారులతో రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిఒ ఎంఎస్ నెంబర్ 30 మార్గదర్శకాల మేరకు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల ఆక్రమణ రెగ్యులరైజేషన్, రీ సర్వే, ఫ్రీహోల్డ్ భూములపై తీసుకున్న పిఒటి కేసులు, 22(ఎ)భూముల పరిష్కారం తదితర అంశాలలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు భూములు అవసరం అవుతాయని, మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి తగిన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. ఈ అంశంలో మండలాల వారీగా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకం 2025లో భాగంగా ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల మేరకు 2019 అక్టోబరు 15కు ముందు ప్రభుత్వ భూములను అనధికారికంగా ఆక్రమించుకుని ఏర్పరచుకున్న నివాస గృహాలలో అభ్యంతరకరం లేని వాటి క్రమబద్ధీకరణ అంశంలో గుర్తించిన యూనిట్లు, తీసుకున్న చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. హౌసింగ్ రీ వెరిఫికేషన్ పెండింగ్ కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు సాధ్యతలపై కూడా వెంటనే నివేదికను పంపాలని సూచించారు. జిల్లాలో పచ్చి మేత పెంపకానికి డివిజన్, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, డికేటీ, ప్రైవేట్ భూములను ప్రతి మండలంలో కనీసం 3 వేల ఎకరాలను గుర్తించాలని, ఇందుకు ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. వివిధ పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి, ధోబిఘాట్ల ఏర్పాటుకు అవసరమైన భూముల ప్రతిపాదనలు కూడా వెంటనే సమర్పించాలన్నారు. అదేవిధంగా రీ సర్వే ప్రగతి, ఫ్రీ హోల్డ్ భూములపై తీసుకున్న పిఒటి కేసులు, 22(ఎ)భూముల పరిష్కారం తదితర అంశాలలో కూడా మండలాల వారీగా సమీక్ష చేశారు. ప్రగతిలో వెనకబడిన మండలాల తాసిల్దార్లను కారణాలు అడిగి తెలుసుకుని తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. రెవిన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదన్ రావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, ఆర్‌డిఒ శ్రీనివాస్, సర్వే శాఖ ఎడి భరత్ కుమార్, తహశీల్దార్లు పాల్గొన్నారు.

టింబర్ డిపోలో భారీ అగ్ని ప్రమాదం

- రూ.3 కోట్ల ఆస్తి నష్టం

టింబర్ డిపోలో ఎగిసి పడుతున్న మంటలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యుత్తు సబ్ స్టేషన్‌కు సమీపంలోని అన్నమయ్య టింబర్ డిపోలో గురువారం రాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదంలో కొయ్య మొక్కలతో పాటు కోత యంత్రం, మోటారుతో సహా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. గురువారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ వారు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ఫైర్ ఇంజన్లతో అదుపు చేసినప్పటికీ జరగాల్సిన నష్టం పూర్తిగా జరిగిపోయింది. నందలూరుకు చెందిన టింబర్ డిపో యజమాని పెమ్మబోయిన హరికృష్ణ జరిగిన ప్రమాదంపై పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యుదాఘాతంతో ఈ ప్రమాదం జరిగిందా లేక ఎవరైనా ఆకతాయి చేష్టల వలన జరిగిందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద ఘటనను తెలుసుకున్న జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు ఘటన స్థలానికి చేరుకుని జరిగిన ప్రమాదంపై ఆరా తీశారు. బాధితుడు హరిని పరామర్శించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం ప్రజా వేదిక నందు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. నిమ్మనపల్లి మండలం, రాచవేటివారిపల్లి పంచాయతీ, వడ్డీపల్లి దగ్గర తాగునీరు అవసరం ఉందని అర్జీ ఇవ్వగా వెంటనే అధికారులతో మాట్లాడి బోరు వేయాలని ఆదేశించారు. పింఛన్ కొరకు వచ్చిన అర్జీలను విచారించి వెంటనే పింఛన్ వచ్చేలాగా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. తల్లితండ్రులను వేధిస్తున్న కొడుకుపై చర్యలు చేపట్టాలని నిమ్మనపల్లి ఎస్సైకి తెలిపారు. రేషన్ కార్డు కొరకు ఇచ్చిన అర్జీపై విచారించి వెంటనే లబ్ధిదారునికి రేషన్ కార్డు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం జామీయా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు మదనపల్లి నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ప్రజలందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, టిడిపి నాయకులు నాదెళ్ల శివన్న, చెంద్రాయుడు, జెసిబి వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాగుణం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ, సేవాగుణం పెంపొందించు కోవాలని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె ప్రధాన శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం అట్టహాసంగా ముగిసింది. గ్రంథాలయ అధికారి ఆర్.వసంత కుమారి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వై.ఎస్.మునిరత్నం, కామకోటి ప్రసాదరావు, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, టిఎస్ఎ కృష్ణమూర్తి, యుగంధరాచారి, అధ్యాపకుడు కృష్ణమూర్తి, ప్రసాద్ శర్మ, మదన్ మోహన్, జివిఎస్ బాబు, అధ్యాపకురాలు మోహన్ వల్లి, కవితా రాణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమకు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెలవులు వచ్చినప్పుడు వాటిని వృధా చేసుకోకుండా గ్రంథాలయ పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. చిన్నతనం నుండే సేవా కార్యక్రమాలను, దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో మర్యాద పూర్వకంగా నడుచుకొని, పెద్దలను గౌరవించాలన్నారు. చిన్నారులు పుట్టినరోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకొని అందుకు వెచ్చించే ఖర్చును సమాజ సేవకు వినియోగించాలన్నారు. ప్రతి పుట్టినరోజుకు ఒక మొక్కను నాటి దానిని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. వేప, జామ, మామిడి మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.వఇందులో భాగంగా వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంతకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 28 ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం జూన్ 6 అనగా శుక్రవారంతో ముగిసిందన్నారు. ఈ విజ్ఞాన శిబిరాన్ని జయప్రదం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, అతిథులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ గ్రంథాలయ కార్యక్రమాలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

'మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పదవ తరగతి ఫలితాల మూల్యాంకనంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నందని, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖ సూపరిండెంట్ సురేష్ బాబుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర చక్రధర్, జిల్లా అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్ మాట్లాడుతూ పదవ తరగతి మూల్యాంకనంలో ఫెయిలైనవారు విద్యార్థులు కాదని ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని ఆరోపించారు. మంత్రి లోకేష్ పూర్తిగా విఫలమయ్యారని, ఆయన బాధ్యత తీసుకుని తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 6 లక్షల మందికిపైగా విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని విమర్శించారు. 6.14 లక్షల మంది విద్యార్థులు నిబద్ధతతో చదివి పరీక్షలు రాస్తే జవాబు పత్రాల మూల్యాంకనం లోపంగా జరగడం వల్ల ఫలితాలు అన్యాయంగా వెలువడాయని తెలిపారు. ఈ కారణంగా ప్రతి విద్యార్థి తన మార్కుల జాబితాపై అనుమానంతో ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. రీవాల్యుయేషన్‌కు ఎలాంటి ఫీజు లేకుండా అవకాశం కల్పించి తుది ఫలితాలు వచ్చే వరకు పదవ తరగతి మార్కుల ఆధారంగా జరిగే అన్ని అడ్మిషన్లను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. తప్పిదాలకు బాధ్యులైన మంత్రి నారా లోకేష్ సహా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భువనేశ్వర్‌రెడ్డి, మణికంఠరెడ్డి, యూసఫ్ ఖాన్, లోకనాథం, శివకుమార్, మొఘల్ ఫైజాన్ బెగ్, సయ్యద్ ఫైజాన్, జగదీష్, షేక్ ఒవైజ్, షేక్ మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఈద్గా పరిసరాలు శుభ్రం

ఈద్గాను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-పీలేరు : పట్టణంలోని ఈద్గా మైదానం, దాని పరిసరాలను సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష తన సొంత నిధులతో జెసిబి ఏర్పాటు చేసి శుక్రవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఇఒ గురుమోహన్ మాట్లాడుతూ శనివారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకోవడానికి వీలు కల్పిస్తూ తగిన ఏర్పాట్లు సమకూరుస్తున్నట్లు వారన్నారు. పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య పనులు పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకున్నామని, పరిసరాలను కూడా శుభ్రపరచడానికి వ్యక్తిగతంగా తనవంతుగా సహకారం అందిస్తూ జెసిబి ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ చెప్పారు. శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే సామూహిక ఈద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనడానికి ముస్లిం సోదరులందరూ సమయానికి ఈద్గాకు చేరుకోవాలని విజ్ఞప్తి చేసుకున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్, పంచాయతీ సిబ్బంది, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ నిర్వహించాలి

- పీస్ కమిటీ సమావేశంలో కలెక్టర్ శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

బక్రీద్ పండుగను మతసామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో ఎస్‌పి విద్యాసాగర్ నాయుడుతో కలిసి వివిధ శాఖల అధికారులు, అన్ని మతాల మత పెద్దలతో కలెక్టరు అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా శనివారం బక్రీద్ పండుగ జరుపుకోవాలని పేర్కొన్నారు. అన్ని మతాలకు సంబంధించి చట్టాన్ని ఉల్లంఘించకుండా, శాంతియుతంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగ చేయకుండా ప్రశాంతంగా పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. జంతువధ శాలల వద్ద ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలన్నారు. వధ చేసే జంతువులను కూడా అత్యంత మానవీయ కోణంలోనే నిర్వహించాలని సూచించారు. నిషేధించబడిన ఆవులు, దూడలు, ఒంటెల వధకు పాల్పడరాదన్నారు. ఎలాంటి మతపరమైన, సున్నితమైన అంశాలను సూక్ష్మ దృష్టిలో చూడకుండా అన్ని మతాల ప్రజలు సహనం, సంయమనంతో సంతోషంగా సంప్రదయాలను గౌరవించుకుంటూ బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలన్నారు. ప్రస్తుతం అతి వేగవంతంగా అసత్య లేదా తప్పుడు సమాచారం సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్న యువతను కూడా కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని మతాలకు చెందిన యువకులకు బక్రీద్ పండుగ నిర్వహణ, సంప్రదాయాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. స్లాటర్ హౌస్‌ల వద్ద ఏర్పడే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో కూడా సమావేశాలు ఏర్పాటు చేసి సంబంధిత పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా చేశామన్నారు. 24/7 ప్రకారం కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, జిల్లా నోడల్ అధికారిని కూడా నియమించినట్లు చెప్పారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదని, ఏదైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలని కోరారు. నిషేధించబడిన ఆవులు, దూడలు, ఒంటెలను ఎవరు రవాణా చేయరాదన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో రాత్రి 9 నుంచి ఉదయం వరకు పెట్రోలింగ్ టీములు ఉన్నాయని, చెక్‌పోస్టులలో కూడా పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అందరూ చట్టాలను గౌరవించాలి, ఎవ్వరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదన్నారు. తెలియనితనంతో కొందరు చేసే చేష్టలు ఇతరులకు ఇబ్బందికరంగా మారుతాయన్నారు. అలాంటి సమయాలలో అందరూ సంవయనం పాటించాలిన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా గుర్తించిన ప్రదేశాలలోనే జంతువధ నిర్వహించుకోవాలన్నారు. బక్రీద్ పండుగను ఇతరులకు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సామరస్యంగా, సంతోషంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.సమావేశంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ స్లాటర్ హౌస్‌ల వద్ద శానిటేషన్, మంచినీటి సరఫరా చేయాలని, అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్, రెవిన్యూ యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు మాట్లాడుతూ చట్టం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో మతసామరస్యంగా నిర్వహించుకునేలా తమ సంపూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, అందరికీ అవగాహన కలిగేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, డిఆర్‌ఒ మధుసూదన్‌రావు, అడిషనల్ ఎస్‌పిలు ఎం.వెంకటాద్రి, మనోజ్ రామనాథ్ హెగ్డె, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హిదాయతుల్లా, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, శాంతి కమిటీ సభ్యులు, అన్ని మతాల మత పెద్దలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇంజనీర్ నాగేంద్ర

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ముందుండాలి

ప్రజాశక్తి-మదనపల్లె

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ముందుండాలని పింఛ డ్యామ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.నాగేంద్రనాయక్ అన్నారు. శుక్రవారం మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న సహజ, మానవ నిర్మిత అంశాలన్నీ కలిపి ఒక జీవి యొక్క జీవితాన్ని ప్రభావితం చేసే వాతా వరణమే పర్యావరణమని పేర్కొన్నారు. నేల, నీరు, గాలి మానవ మనుగడకు అత్యంత అవశ్యకాలన్నారు. ఈ మూడూ ఇప్పుడు కలుషితం అవుతూ ఉండడం భూమి మీద ఉన్న సకల జీవరాశికీ ప్రాణసంకటంమైందని తెలిపారు. పర్యావరణంలోకి విడుదలవుతున్న ఇతర కాలుష్య కారకాలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణ వ్యవస్థల్ని మరింతగా ధ్వంసం చేస్తున్నాయని, ప్లాస్టిక్ కాలుష్యాన్ని సమర్థంగా ఎదుర్కోడానికి ప్రపంచ దేశాలన్నీ ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కొందాం అనే నినాదంతో ఈ సంవత్సరపు పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకోవాలని ఐక్య రాజ్య సమితి కోరింని పేర్కొన్నారు. వాతావరణంలోకి కార్బన్ డయాక్సైడ్ చేరడంవల్ల వాతావరణం వేడెక్కి దాని ఉష్ణోగ్రత పెరిగిపోతోందని తెలిపారు. కాలుష్యం పెరగడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు వీటిని దృష్టిలో ఉంచుకొని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ దీపంకర్ రోయ్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పూజారి రాజేష్, ఫాకల్టీ కో-ఆర్డినేటర్ వీరేష్, అనిత పాల్గొన్నారు.

'కూటమి పాలన ఆదర్శవంతం'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ఆదర్శవంతంగా సాగుతోందని తెలుగుదేశం పార్టీ మదనపల్లి నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు, రజక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు ముసలికుంట నాగయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కురవంక రజక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఏడాది పాలనలోనే నియోజకవర్గం అభివృద్ధిలో గణనీయంగా పురోగతి సాధించారన్నారు. రూ.40 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేసి చూపించారని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం పాలన విజయాలపై జీర్ణించుకోలేని ప్రతిపక్ష వైసిపి వెన్నుపోటు కార్యక్రమం నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెన్నుపోటు మొదలైందే మాజీ సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఇంటి నుండేనన్నారు. ఐదేళ్ల వైసిపి వెన్నుపోటు రాజకీయాలు చేసినందుకే ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసి ఇంటికి సాగనంపినా ఇంకా మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా సాగుతోందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, భరోసా పెన్షన్లు, డిఎస్‌సి నిర్వహణ అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి రానున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో పెద్దఎత్తున సిమెంట్ రోడ్ల నిర్మాణం, తాగునీటి ఎద్దడి నివారణకు కొత్త బోర్లు వేసి నీటిసరఫరా పునరుద్ధరణతో సమస్యలను సత్వరం పరిష్కారం చేయడానికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతోందని గుర్తుచేశారు. రైతులకు సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, ఆధునిక యంత్రాలు అందివ్వడంతో పాటు, పాడి రైతులకు అండగా నిలిచిన ఘనత కూటమి ప్రభుత్వం దేనన్నారు. ఈ నేపథ్యంలో జగన్ మోహన్‌రెడ్డి ఆరోపణల్లో ఎలాంటి విశ్వసనీయత లేదని ఖండించారు. కార్యక్రమంలో రజక సాధికార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిమడుగు రామ్మూర్తి, రజక సంఘాలు ప్రతినిధులు మునిరత్నం, బండ్రేవు రమణ, శివయ్య, వెంకటా చలపతి, ఆనంద్, కలకడ రెడ్డెప్ప, నరసింహులు, శ్రీనివాసులు, హరి పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్లను పరిశీలిస్తున్న ఎంఇఒ-2 రామచంద్రారెడ్డి

విద్యా మిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కలకడ

శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఒ-2 రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యా మిత్ర కిట్ల స్టాక్ పాయింట్ ద్వారా విద్యార్థులకు వచ్చే ఏడాది కావలసిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, స్కూల్ బ్యాగులు తదితర విద్యా మిత్ర కిట్ల సామగ్రిని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించినట్లు తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభం అయిన వెంటనే విద్యార్థులకు కావలసిన విద్యా సామగ్రిని పంపిణీ చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని విద్యామిత్ర కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9న యోగాంధ్ర : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల స్థాయిలో జరిగే యోగాంధ్ర శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 6 గంటల నుంచి 7.30వరకు స్థానిక జడ్‌పి హైస్కూల్(తెలుగు) క్రీడా మైదానంలో పంచాయ తీరాజ్, రెవెన్యూ, ఆరోగ్య శాఖ, పోలీస్ సిబ్బంది, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖ, విద్యుత్, ఉపాధి, వెలుగు సిబ్బంది, అంగనవాడి సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజలు యోగా శిక్షణ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారు యోగా మ్యాట్‌ను తమ వెంట తీసుకురావాలన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - బి.కొత్తకోట

లక్ష్మీప్రసన్న | విజయ్‌కుమార్ | లోకేష్‌నాయుడు

మండలంలోని బడికాయలపల్లె జడ్‌పి హైస్కూల్‌లో 8వ తరగతి చదువు తున్న లోకేష్ నాయుడు, విజయ్ కుమార్, లక్ష్మీ ప్రసన్న ముగ్గురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపిక య్యారని ఎంఇఒలు రెడ్డిశేఖర్, భీమేశ్వరచారి పేర్కొన్నారు. వీరికి సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు నగదు వీరి వ్యక్తిగత ఖాతాలకు జమ చేయబడుతుందన్నారు. ఒకే పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎన్నిక కావడం సంతోషదా యక మని అన్నారు. ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.గత ఐదు సంవత్స రాలుగా ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వెళ్లిన మోహన్‌నాయుడు, ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. వారి సహకారంతోనే పదవ తరగతిలో కూడా ఉత్తమ ఫలి తాలు సాధించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. నూతనంగా పాఠశాలలో ప్రధా నోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించబోతున్నబాలసంజీవ్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లు భర్తీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతితో పాటు 7,8,9 ఇంటర్మీ డియట్ మొదటి ఏడాదిలో మిగిలిపో యిన సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటంలో తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల ప్రకారం మిగిలిన సీట్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రవేశాలకు ఆన్‌లైన్ ఫీజును చెల్లించేందుకు ఈనెల 5 నుంచి 20 వరకు అవకాశం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు పాఠశాల స్థాయిలో 24న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 25న వెల్లడించడం జరుగుతుందని అన్నారు. 26న ధ్రువ పత్రాలను పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న దానియేల్

సమాజ హితమే ఎంఆర్‌పిఎస్ ఉద్యమ తత్వం

ప్రజాశక్తి-పీలేరు : సమాజ హితమే ఎంఆర్‌పిఎస్ ఉద్యమతత్వమని జిల్లా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌సి ఇన్‌ఛార్జి కోట దానియేల్ తెలిపారు. శనివారం పీలేరులోని శ్రీవారి కల్యాణ మండపంలో అన్నమయ్య జిల్లా ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం జిల్లా సీనియర్ నాయకులు పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేశ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు వై.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా హాజరైన కోట దానియల్ మాట్లాడుతూ సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలు లేని సమాజ నిర్మాణం కాంక్షిస్తూ ఉద్యమం తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందన్నారు. మాదిగ సమాజానికి దక్కాల్సిన రిజర్వేషన్ హక్కుల కోసం విభిన్న ప్రతిభావంతులు, వృద్దులు, వితంతువుల కోసం పోరాడి వారికి పెన్ష న్లు సాధించడం జరిగిందన్నారు. గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ పథ కం, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వే షన్లు, మహిళల భద్రత కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ఎంఆర్‌పిఎస్ సాధించిందేనని చెప్పారు. ఎంఆర్‌పిఎస్ 31 ఆవి ర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు, రాజంపేట ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌సి జాతీయ నాయకులు శివయ్య, రాధాకృష్ణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెంకటేష్, కో-ఇన్‌ఛార్జి వెంకట రమణ, విహెచ్‌పిఎస్ నియో జకవర్గ ఇన్‌ఛార్జి రామ మోహన్‌రెడ్డి, మండలం ఇన్‌ఛార్జిలు అమర్నాథరెడ్డి, వెంకటేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

I.A.No. 115/2022
I.A.No. 869/2018
A.S.No. /2018

పటాన్ జమురుల్లా ఖాన్, Represented by జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ Holder by షేక్ హసన్ బాషా, S/o షేక్ సైదుబా సాకిన్, కొత్తపల్లి, H/o మహమ్మద్ పురా వీధి, రాయచోటి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా.

...పిటిషనరు(పిటిషనరు)

Vs

షేక్ నిజాముద్దీన్, S/o ఖాదర్ సాహేబ్, సాకిన్ Opp: State Bank of India మెయిన్ బజార్, చిన్నమండెం మండలం, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంటు (రెస్పాండెంటు) నెం.3

ప్రకటన

పై నెంబరు దావాలోని రెస్పాండెంటు (R3) అయిన నీ పైన I.A.No. 869/2018 గల నెంబరు డిస్మిస్ అయినందు వలన సదరు నెంబరు మరల Restore చేసుకొనుటకు గాను అగు డిలే పిటిషను దాఖలు చేయుచున్నాము. నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 23.06.2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు సదరు కోర్టులో హాజరై నీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట నీ పరోక్షమున తీర్మాణించబడును అని ఇందుమూలముగా ఖండితముగా తెలియజేయడమైనది.

//By Order of the Court//

యు.రామాంజనేయులు
జి.సి.ఎస్. రాయుడు
పిటిషనరు తరపున వకీలు
అడ్వకేట్స్, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

మండల అభివృద్ధికి సమష్టి కృషి : ఎంపిపి

- పల్లెపండుగ మూడో విడతలో
రూ.1.3 కోట్లతో పనులు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-రామాపురం

మాట్లాడుతున్న ఎంపిడిఒ జాషువా

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎంపిపి విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఎంపిడిఒ సభాభవనంలో ఎంపిపి అధ్యక్షులు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జాషువా మాట్లాడుతూ మండలంలో మూడో విడత పల్లెపండుగలో రూ.1.3 కోట్లతో తొమ్మిది రకాల పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పల్లెపండుగ నిధులతో తాగునీరు, ఉపాధి పనులకు చేపట్టబోతున్నట్లు ఎంపిడిఒసభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో 13 గ్రామ పంచాయతీలలో ఏడు పంచాయతీలను గుర్తించి అందులో తడి పొడి చెత్తలను వేరు చేయడం గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి నాగమణి మాట్లా డుతూ మండలానికి వేరుశనగ, నారాయణ సీడ్ రకం 764 క్వింటాళ్లు మంజూరైనట్లు ఆమె తెలి పారు. 30 కేజీల బస్తా, ధర రూ.2550 కాగా సబ్సిడీ రూ.1140 పోను రైతు రూ.1710 చెల్లించి విత్తన కాయలు పొందవచ్చని అన్నారు. రైతులు గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాలలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసుకునేవారు మందులు పిచికారి చేయుటకు కావలసిన యంత్రాలను 80శాతం సబ్సిడీతో పొందవచ్చని, 20శాతం రైతు చెల్లించవలసి ఉందని ఆమె సభ్యులకు వివరించారు.ఎంఇఒ రామకృష్ణుడు మాట్లాడుతూ మండలంలోని 54 పాఠశాలల విద్యార్థులకు సంబంధించి యూనిఫామ్, బెల్టు, బూట్లు, పుస్తకాలు, నోటు పుస్తకాలు మంజూరు అయ్యాయని తెలి పారు. పశు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పశువులకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్ 11000 డోసులు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ హుస్సేనమ్మ మండలంలో 223 మంది గర్భిణులు, 215 మంది బాలింతలు ఉన్నారని వారికి రోజు రూ.25లు విలువగల పౌష్టికాహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ ఎపిఒ పెంచ లయ్య మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పదివేల మందికి కొత్త జాబ్ కార్డులు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. పిఎం సూర్య పథకం కింద70శాతం సబ్సిడీని విద్యుత్ వినియోగదారులు సద్విని యోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇతర శాఖల అధికారులు తమ నివేదికలను సభలు వివరించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

టిబి ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన

టిబిపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-కలికిరి

టిబి ముక్త్ భారత్ అభియాన్, మలేరియా మాసోత్సవాలను విజయవంతం చేద్దామని మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప అన్నారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, సబ్ యూనిట్ అధికారి ముజీబ్, మేడికుర్తి గ్రామంలో స్వయం సహాయక బృంద సభ్యులకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ టిబి ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి పొగతాగు వారిని, మద్యం సేవించు వారిని, గతంలో టిబి జబ్బు వచ్చి భాగైన వారిని, హెచ్ఐవి. పాజిటివ్ వారిని, బిఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వారిని, గర్భిణులు, షుగర్ ఉన్న వారిని, దీర్ఘకాలిక జబ్బులు ఉన్న వారిని గుర్తించి వారికి గళ్ళ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పాజిటివ్ వచ్చిన యెడల ఆరు నెలల చికిత్స ఉచితంగా ప్రారంభించడం జరుగుతుంది అన్నారు. చికిత్స సమయం లో రోగి ఖాతాలో రూ.1000లు జమ చేయడం జరుగుతుంది అన్నారు. టిబి రోగులకు పౌష్టికాహారం అందించుటకు వారిని దత్తత తీసుకోవడానికి పోషన్ మిత్రలు ముందుకు రావాలాన్నారు. జూన్ నెలను మలేరియా వ్యతిరేక మాసోత్సవంనిర్వహించడం జరుగుతుంది అన్నారు. ప్రజలలో ఈ నెల రోజులు దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే మలేరియాపై అవగాహనకల్పిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సరిత, సి.ఆంజనేయులు, విఎఒ ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కురబలకోట శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం అట్టహాసంగా ముగిసింది. స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో 40 రోజులపాటు సమ్మర్ క్యాంపు కొనసాగింది. బాల్యం నుంచి పిల్లలకు పుస్తక పఠనాశక్తి పెంపొందించడంతోపాటు విజ్ఞాన వికా సాన్ని పెంచడం, ఇంగ్లీష్ గ్రామర్, బుక్స్ రీడింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయిం గ్,పేపర్ క్రాఫ్ట్, యోగా స్వర్ణాంధ్రప్రదేశ్ -2047 గురించి అవగాహన కల్పించారు. జికె, మ్యూజికల్ చైర్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఎంపిడిఒ గంగయ్య, కురబలకోట పంచాయతీ సెక్రెటరీ శేషగిరిరావు, జడ్‌పి హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు నాగమణి, గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్ నాయక్ హాజరయ్యారు. 40 రోజులు పాటు జరిగిన సమ్మర్ క్యాంపులో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహు మతులు అందించారు. ఈ సందర్భంగా శాఖ గ్రంధా లయ అధికారి బి.చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ కురుబలకోట శాఖ గ్రంథాలయంలో 40 రోజులు పాటు నిర్వి ఘ్నంగా జరిగిన సమ్మర్ క్యాంపుకు విద్యార్థులను పంపిన వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయసిబ్బంది మల్లికార్జున, రిసోర్స్ పర్సన్ వల్లి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : ఎస్ఐ

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామాంజనేయులు

ప్రజాశక్తి- కలకడ

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్ఐ రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని స్థానిక బాటవారిపల్లి పంచాయతీ హంద్రీ-నీవా కాల్వ సమీపంలో వాహనాలను తనిఖీలు నిర్వహించిన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహన దారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించినట్లు తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని సూచిం చమన్నారు. కార్లు తదితర వాహనంలో నడిపేవారు సీట్ బెల్ట్ ధరించి వాహనంలో నడపాలని సూచించినట్లు తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటించే వారు ప్రమాదాలకు దూరంగా ఉండేం దుకు అవకాశం ఉందని అన్నారు. రికార్డులు సక్రమంగా లేనివారికి అపరాధ రుసుమును విధించి నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రతిభ పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులు

మదనపల్లె అర్బన్

తేజశ్విని

మదనపల్లె పట్టణం నుంచి జనరల్ కేటగిరిలో ప్రతిభ పురస్కారానికి విద్యార్థిని రుద్రయ్యగారి తేజస్విని ఎంపికైంది. 9న సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకోనుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 989 మార్కులు సాధిం చినందుకు జనరల్ కేటగిరీలో ప్రతిభ పురస్కారానికి రుద్రయ్యగారి తేజస్వి నిని ఎంపిక చేశారు. సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో సుధా కన్వెన్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ పురస్కారం ప్రదానం చేయనున్నారు.ఈ సందర్భంగా విద్యార్థినిబ రుద్రయ్యగారి తేజస్విని మాట్లా డుతూ తనను ప్రభుత్వం గుర్తించి ప్రతిభ పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల గర్వంగా ఉందన్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తన ప్రతిభకు కారణమైన కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరింత బాధ్యతగా కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవడానికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

సాయి కళాశాల విద్యార్థుల ప్రభంజనం

రాయచోటి : పట్టణంలోని శ్రీ సాయి ఇంజి నీరింగ్ కళాశాల విద్యార్థులు, ఇటీవ ల విడుదలైన రెండవ సం వత్స రం రెండవ సెమి స్టర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో అగ్రశ్రేణిలో నిలిచారని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా మా కళాశాల విద్యార్థులు విశిష్టమైన ఫలితాలు సాధించి, కళాశాల పేరు ప్రతిష్టలను పెంచారని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల సహకారాన్ని ప్రశంసిస్తూ వారిని అభినందించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఎం. సాయి దీప్న 89.44 శాతంతో ప్రథమ స్థానం, ఇ.సునీత 87.88 శాతంతో ద్వితీయ స్థానం,హీబా ఫాతిమా మయాన 86.33శాతంతో తృతీయ స్థానం సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో అరమాటి హారతి 80.4 శాతం తో ప్రథమ స్థానం, జి. శరణ్య 77.6 శాతంతో ద్వితీయ స్థానం, కె.శివాజీని 76.7 శాతంతో తృతీయ స్థానం, కళాశాలలో విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్ రీజనింగ్ వంటి రంగాల్లో ప్రత్యేక శిక్షణనూ అందిస్తూ, విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నామని కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వెంకటరమణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కరుణాకర్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభ చాటిన విద్యార్థినిలు

సత్తాచాటిన స్వతంత్ర భారతి విద్యార్థులు

వాల్మీకిపురం: పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. ఇందులో భాగంగా పట్టణంలోని స్వతంత్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు యశస్విని, వినయశృతిలు ఎంపికైనట్లు పాఠ శాల కరస్పాండెంట్ ఎఎస్ఎన్ కుమార్ తెలిపారు. యశస్విని 576 మార్కు లు, వినయశృతి 571 మార్కులు సాధించడంతో స్వతంత్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ మండల స్థాయిలో మొదటి స్థానం సాధించింది. త్వరలో ఈ విద్యార్థులకు ప్రభుత్వం ప్రతిభా పురస్కారంను అందించనుంది. ప్రతిభా పురస్కారానికి ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఎఎస్ఎన్ కుమార్, హెచ్‌ఎం హసీన, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, హెచ్‌ఎం రోహిణి

విశ్వమైత్రి విద్యార్థిని ఎంపిక

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని విశ్వమైత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని రోహిణి 575మార్కులు సాధించి ప్రతిభ పురస్కారానికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఇంద్రనాథ్ తెలిపారు. అనంతరం రోహిణిని కరస్పాండెంట్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించింది.

నిస్సార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

మతసామరస్యానికి ప్రతీక బక్రీద్ : నిస్సార్ అహ్మద్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మతసామరస్యానికి, త్యాగానికి బక్రీద్ పండుగ ప్రతీకగా నిలిచిందని, నియోజక వర్గంలోని ముస్లిం సోదరులు పండుగను సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిస్సార్అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తవళం, ముష్టూరు గ్రామంలోని చల్లావారిపల్లెలో ఆయన పర్యటించారు. తవళం గ్రామంలోని బొమ్మనపల్లి లక్ష్మన్న, మాజీ సర్పంచు కొరివి మల్లికార్జున ఆహ్వానం మేరకు నూతన గృహప్రవేశ కార్యక్రమంలోవైసిపి నాయకులు, కార్యకర్తలతో కలసి పాల్గొన్నారు. అనంతరం చల్లావారిపల్లెలోని ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు నురానా మసీదులో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి, మతసామరస్యానికి బక్రీదు పండుగ ప్రత్యేక చిహ్నంగా నిలిచిందని అన్నారు. ప్రజలంతా సోదరభావంతో, ఐకమత్యంతో, మతసామరస్యం వెల్లువిరిసేలా ప్రశాంత వాతావరణంలో సంతోషంగా బక్రీదు పండుగను జరుపుకోవాలని పేర్కొన్నారు. కార్యక్ర మంలో మండల వైసిపి ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా, అంజాద్, హోటల్ రఫీ, మస్తాన్, ముబారక్, శంకర, గంగాధర, రవి, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోవాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర పేర్కొన్నారు.శుక్రవారం పట్టణంలోని ఈద్గాను ఆయన స్థానిక పోలీసులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం బక్రీద్ పండుగ వేళ ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసు శాఖ పటిష్ట ఏర్పాటు చేసిందన్నారు. హిందూ,ముస్లింలు ఐకమత్యంతో పర్వదినాలు జరుపుకొని మతసామరాస్యాన్ని చాటాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సిఐ జీవన్ గంగానాథ్ బాబు, పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం మంజునాథ్‌కాలనీ అంగన్వాడీ కార్యకర్త మల్లీశ్వరి అధ్యక్షతన అంగన్వాడీ కేంద్రంలో జరిగింది. కాలనీవాసులు సుమారు 200 మంది ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి వైద్యం 15, కేన్సర్ నాలుగు కేసులను వైద్యులు శస్త్ర చికిత్సలకు రెఫర్ చేయగా ఉచితంగా వైద్యం చేయిస్తామని వైదేహి ఆస్పత్రి వైద్యులు హామీనిచ్చారు. ఎముకల డాక్టర్, గుండె వైద్య నిపుణులు, కంటి వైద్యం, జనరల్ సర్జరీ నిపుణులు హాజరై ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో యంగ్ఇండియా ఫౌండేషన్ అధ్యక్షులు తగాది రాజశేఖర్, సభ్యులు అనిల్, రెడ్డిబాషా, గుండ్ల లక్ష్మిదేవి సిడిపిఒ సుజాతమ్మ, శాంతమ్మ అంగనవాడి సిబ్బంది మల్లేశ్వరి, పోర్డ్ సంస్థ డైరెక్టర్ లలితమ్మ, మంజనాథ్ కాలనీ ప్రజలు, వైదేహి సిబ్బంది, క్యాంపు ఇంచార్జి డాక్టర్ లోకేష్ భరణి, సంకేష్, డాక్టర్ విఖ్యాత్, కిరణ్, శ్రేయస్ మురళి, చేతన్, కాజల్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తేజశ్రీ(ఫైల్ ఫొటో)

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం పట్టణంలో వెలుగు చూసింది. రెండవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, బికేపల్లి కాలనీకి చెందిన శివకేశవ, రెడ్డమ్మ దంపతుల కుమార్తె తేజశ్రీ (20)ని మదనపల్లె పట్టణం నీరుగట్టువా పల్లి చౌడేశ్వరి నగర్‌లో కాపురం ఉంటున్న చెల్లెమ్మ కుమారుడు రఘుకు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఏడాది కుమారుడు ఆదిత్య ఉన్నాడు. గత కొంతకాలంగా వీరిమధ్య గొడవలు జరుగుతున్నాయి. రఘు మద్యానికి అలవాటుపడడమే ఇందుకు కారణం. దీనికి తోడు అత్త చెల్లెమ్మ సైతం అదనపు కట్నం కోసం వేధింపులు పాల్పడుతోంది. రఘు స్వగ్రామం తమిళనాడు రాష్ట్రం సేలంలో జాతరకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో రాత్రి పొద్దుపోయిన రఘు ఇంటికి రావడంతో తేజశ్రీ భర్తకు ఫోన్ చేసింది. జాతరకు బయలుదేరాలి కదా.. త్వరగా ఇంటికి రమ్మని చెప్పినప్పటికీ తనకు పని ఉందని, వేరేచోట పార్టీ ఉందంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన తేజశ్రీ ఇంట్లోకి వెళ్లి, తలుపు వేసుకుని క్షణికావేశంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే తలుపు తట్టి, బద్దలు కొట్టి లోపలికి వెళ్లేలోపే మృతి చెందింది. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ కుమార్తె మృతికి భర్త, అత్తే కారణమని మృతురాలి తల్లిదండ్రులు శివకేశవ, రెడ్డెమ్మలు ఆరోపిస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఎస్ఆర్ పాలెం వద్ద శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటోలో రాజంపేట వైపుగా ఆటోలో వెళ్తున్న ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పట్టణంలోని శుద్ధ గుంతలకు చెందిన బొగ్గల నాగేంద్ర బాబు(39)గా గుర్తించారు. ఇతనికి భార్య, 5 సంవత్సరాల కుమార్తె, 3 సంవత్సరాల కుమారుడు ఉన్నారు. ఆటో నడుపుకొని కుటుంబాన్ని పోషించే నాగేంద్రబాబు అకస్మిక మృతితో భార్యా, పిల్లల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యువతి అదృశ్యమైన సంఘటన మండలంలో జరిగింది. పట్టణంలోని జయశ్రీ కాలనీలో నివాసముండే నరసింహులు కుమార్తె వయస్సు (19) అంగళ్లులోని ఓ ప్రయివేట్ కళాశాలలో బిసిఎ రెండవ సంవత్సరం చదువుతుతోంది.ఈనెల 4న ఉదయం 10 గంటలకు నరసింహులు అతని భార్య వ్యవసాయ పనులు నిమిత్తం పొలం వద్దకు వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో నవిత ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపో యింది. యువత తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికారు. యువతి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.